క్లుప్తంగా

వ్యర్థాలను తొలగించండి



తెనాలిఅర్బన్: రోడ్లపై ఉన్న వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 35,36,37,38 వార్డుల్లో గురువారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, వ్యాపారులు రోడ్లపై చెత్తను వేయవద్దని సూచించారు. కార్మికులు ప్రతిరోజు వార్డులోకి వస్తారని, వారికి అందజేయాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

తక్కువ ధరకు వంటనూనెల విక్రయాలు

తెనాలిరూరల్: వంటనూనెల ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రజలకు తక్కువ ధరలకు నూనెలు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా సివిల్ సప్లయీస్ అధికారులు వ్యాపారులతో సంప్రదింపులు జరిపిన ఫలితంగా పట్టణానికి చెందిన పద్మనాభుని సత్యనారాయణ అండ్ కంపెనీ ఆయిల్ మర్చంట్స్ నిర్వాహకులు తక్కువ ధరకు నూనెలు విక్రయించేందుకు ముందుకు వచ్చారని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ గురువారం తెలిపారు. ఫ్రీడమ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ రూ.130కి, అలాగే ప్రియా గోల్డ్/ ఫస్ట్ క్లాస్/ఆల్ఫా పామాయిల్ ప్యాకెట్ రూ.119కి విక్రయిస్తున్నారని చెప్పారు. వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు పుర వేదిక వద్ద స్టాల్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా మొత్తంగా 11 షాపుల నిర్వాహకులు తక్కువ ధరలకు నూనెను విక్రయించేందుకు ముందుకు వచ్చినట్లు తహసీల్దార్ వెల్లడించారు. వ్యాపారులను అభినందించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చుండూరు స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని గురువారం పరిశీలించారు. సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. రైల్లో నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటాద్రి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440627554 నంబరులో సంప్రదించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

తెనాలిఅర్బన్: అమరావతి ప్లాట్స్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హామీ ఇచ్చారు. అమరావతి ప్లాట్స్‌లోని కమ్యూనిటీ హాల్‌లో గురువారం సాయంత్రం స్థానికులతో సమావేశాన్ని నిర్వహించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉడా పరిధిలో కాలనీ ఉండేదన్నారు. నేడు పురపాలక సంఘ పరిధిలోకి వచ్చిందని, ఇక్కడ మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. కాలనీ వాసులు కూడా సహకరించాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్ కొమ్మరబత్తుని జయపాల్, మట్లపూడి రాజేశ్వరరావు, జానీ, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.


సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

తాడేపల్లిరూరల్ : డిగ్రీ విద్యార్థులకు, నిరుద్యోగులకు మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు వంగర సురేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కృష్ణా, ఎన్టీఆర్, పశ్చిమ గోదావరి జిల్లాల వారికి 22 సంవత్సరాలకు పైగా అనుభవం గల సాప్ ప్రాజెక్ట్ మేనేజర్‌తో ఎస్ఏపీ ఎస్డీలో శిక్షణ ఇవ్వనున్నామని, శని, ఆదివారాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్నామని తెలిపారు. వివరాలకు 93937 71663, 99852 22857, 70935 29750 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

రేపు 'ధ్యాన దసరా' ఉచిత వర్క్‌షాప్

తాడేపల్లిరూరల్ : మానస సరోవర్ ధ్యాన ఆశ్రమంలో ధ్యాన దసరా పేరిట ఉచిత వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపకుడు కళ్ళం రామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడేపల్లి బైపాస్‌రోడ్డులో మణిపాల్ హాస్పటల్ దగ్గర కృష్ణానది తీరాన నిర్మించిన మానస సరోవర్ ధ్యాన ఆశ్రమంలో ఈ నెల 12, 13 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమం ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, ప్రముఖ ఫ్రీక్వెన్సీ థెరపిస్ట్ డాక్టర్ రవి నారాయణ, ప్రముఖ వరల్డ్ లాఫింగ్ థెరపిస్ట్ డాక్టర్ మహమ్మద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామన్నారు.

దుర్గామాత శరణు.. శరణు!



తెనాలి మారిస్‌పేటలో మహాకాళీ అలంకారం



దేవీచౌక్‌లో మహాకాళీగా..



శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



ప్రధాన అయ్యప్పస్వామి దేవాలయంలో..

శ్రీ దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా గురువారం వివిధ ఆలయాల్లోని అమ్మవారు దుర్గామాతగా దర్శనమిచ్చారు. భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. – తెనాలి

మణిహారం..మటుమాయం

"తెనాలిలో చెప్పుకోదగ్గ అయ్యరు హోటలు లేదు. కాఫీ ఇవ్వటం అయ్యర్లకే చాతనవుననే అనుమానం ఎవరికైనా ఉంటే తెనాలి పోయి కాఫీ తాగి చూడండి. మా తెనాలివాళ్లు నలుగురు వచ్చి, మద్రాసులో కాఫీ హోటళ్లు నడపటం ప్రారంభిస్తే, అరవ్వాళ్లు పుంజాలు తెంచుకుని పట్నం వదిలి పారిపోతారు. ఆ చెన్న పట్నం కాస్తా ఆంధ్రులకై ఊరుకొంటుంది."
– సుప్రసిద్ధ సాహితీవేత్త కొడవటిగంటి కుటుంబరావు 1941లో రాసిన ఈ మాటల్లో అతిశయోక్తి లేదు.



మూతపడిన మణి కేఫ్

- తెనాలిలో అలనాటి రుచులు ఇకపై కరవు
- ఒకటొకటిగా మూతపడుతున్న ప్రసిద్ధ హోటళ్లు
- తాజాగా ఆ దారిలోనే మణి కేఫ్ (సుబ్రహ్మణ్యం హోటల్)

తెనాలి: కళల కాణాచిగా విలసిల్లిన తెనాలి కమ్మని భోజనానికి, అల్పాహారానికి ప్రసిద్ధి. వెన్న కాచిన నెయ్యి, కారప్పొడి, అల్లం జీలకర్రతో చేసిన పెసరట్లను ఇప్పటికీ తలచుకునే వారున్నారు. ఇంకా ఇడ్లీ, మినపదోసె గురించీ చెబుతుంటారు. తెనాలి హోటల్‌లో టిఫిన్ చేసి, కమ్మని ఫిల్టర్ కాఫీ తాగేందుకు తెనాలి సమీప గ్రామాల్నుంచి జనం వచ్చి వెళుతుండేవారు. పూర్వం ఏఐసీసీ అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి కామరాజ్‌నాడార్, రాష్ట్ర ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి తెనాలి వచ్చినపుడు, ఇక్కడ హోటళ్ల నుంచి అల్పాహారం, భోజనాల రుచి చూశారు. ఆ తర్వాత కామరాజ్‌నాడార్ ఎప్పుడు రైలులో తెనాలి మీదుగా వెళుతున్నా, రైలు తెనాలి వచ్చే సమయానికి కాంగ్రెస్ నాయకులు అల్పాహారం/భోజనం అందించేవారు. తెనాలిలో గౌతమ్ గ్రాండ్ ప్రారంభ సభలో తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్య ఈ విషయాన్ని సభాముఖంగా చెప్పారు. తెనాలి ఆహార పదార్థాలంటే కామరాజ్‌కు అంత ప్రీతి. లాల్‌బహదూర్‌శాస్త్రి ప్రధానమంత్రి హోదాలో రైలులో వెళుతూ, తెనాలి స్టేషనులో ఆగినపుడు ఇక్కడి అల్పాహారాన్ని ఆరగించారని పెద్దలు చెబుతారు.

ఆధునిక పోకడలతో అంతర్థానం..

ఆధునికతను అందుకుంటున్న తెనాలిలో బార్ అండ్ రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ప్రవేశించటంతో తెనాలి హోటళ్లకు ప్రాధాన్యత తగ్గిపోతోంది. ప్రియ హోటల్, ఉడిపి హోటల్ సహా పలు హోటళ్లు అంతర్థానమయ్యాయి. బోసురోడ్డులో 1964 నుంచీ ఎప్పుడు కిటకిటలాడుతూ వచ్చిన నవయుగ హోటల్ 2015 ప్రాంతంలో మూతపడింది. తర్వాత చేతులు మారింది. పాత భవనాన్ని కూల్చేశారు.

ఒక వెలుగు వెలిగిన మణి కేఫ్

మళ్లీ ఇప్పుడు దశాబ్దాలుగా ఒక వెలుగు వెలిగిన సుబ్రహ్మణ్యం హోటల్‌ను తాజాగా మూసేశారు. స్థానిక టీజే కాలేజీ ఎదురుగా ఉండే ఈ హోటల్ అసలు పేరు మణి కేఫ్. ప్రకాశం జిల్లా నుంచి బతుకుదెరువు కోసమని 13 ఏళ్ల వయసులో బంధువులతో కలిసి తెనాలి వచ్చిన కంకణాల వెంకటసుబ్బారావు ఉరఫ్ కేవీ సుబ్బారావు మొదట కిరాణా కొట్లో పనిచేశాడు. తర్వాత ఉదయం దోసెలు, మధ్యాహ్నం నుంచి మిఠాయి దుకాణం నడిపాడు. వయసు, ఆదాయం పెరిగాక 1983లో మణికేఫ్ పేరుతో హోటల్ ప్రారంభించాడు. పెద్దకొడుకు సుబ్రహ్మణ్యం తండ్రికి చేదోడుగా ఉన్నాడు. తండ్రి తర్వాత సుబ్రహ్మణ్యం నిర్వహణలోకి వచ్చింది. మణి కేఫ్ అని బోర్డున్నా, సుబ్రహ్మణ్యం హోటల్‌గానే జన వాడుకలోకి వచ్చింది.

కమ్మని రుచులు చల్లారిపోతున్నాయి..

అప్పట్లో స్థానికులైన ప్రముఖులే కాకుండా రహదారి బంగళాల్లో దిగిన సినీ, రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులకు సుబ్రహ్మణ్యం హోటల్ నుంచి అల్పాహారం అందేది. పెసరట్టు, ఇడ్లీ కారప్పొడి నెయ్యి, ఊతప్పం, మసాల గారె, దోసె...వేటికవే ప్రత్యేకంగా ఉంటాయనే పేరుండేది. సినిమా నటులు ఏవీఎస్, జయప్రకాష్‌రెడ్డి, తనికెళ్ల భరణి, రాజకీయ ప్రముఖులు కొణిజేటి రోశయ్య, ఆలపాటి ధర్మారావు, నీలం సంజీవరెడ్డి, యడ్లపాటి వెంకట్రావు, నాదెండ్ల భాస్కరరావు, సతీష్‌పాల్‌రాజ్ వంటి ప్రముఖులు సుబ్రహ్మణ్యం హోటల్ రుచులు ఆస్వాదించినవారే. చెన్నైకు చెందిన పారిశ్రామికవేత్త మల్లాది సచ్చిదానందమూర్తి, విశాఖకు చెందిన బిల్డర్ రామకోటయ్య వంటి ప్రముఖులు తెనాలి ఎప్పుడొచ్చినా ఇక్కడ అల్పాహారం తీసుకునేవారు. ప్రస్తుతం ఈ హోటల్ కూడా మూతపడింది. కొడవటిగంటి మాటల్లో జగత్ప్రసిద్ధి చెందిన తెనాలి హోటళ్ల కమ్మని రుచులు ఇలా చల్లారిపోతుండటం భోజన ప్రియులకు విచారకరమే!

ప్రముఖుల ఆకలి తీర్చిన హోటళ్లు

తమిళనాడు నుంచి చిన్నతనంలోనే వలస వచ్చిన నటరాజన్, హోటళ్లలో సప్లయిర్‌గా వంటమనిషిగా రకరకాల పనులు చేస్తూనే తెలుగు నేర్చుకొని, 'శారద' పేరుతో గొప్ప రచయితగా ఎదిగిన విషయం తెలిసిందే. శారదతో పాటు హోటల్‌లో పనిచేసిన ఆలూరి భుజంగరావు హిందీ నేర్చుకుని టీచరు ఉద్యోగంలో చేరి చిరస్మరణీయమైన రచనలు చేసిన వైనం సాహితీలోకానికి తెలుసు. ఆరోజుల్లో పూటకూళ్ల ఇళ్లు, అక్కడ భోజనంతోపాటు ఇతర సౌకర్యాలూ ఉండేవని ఆలూరి రచించిన 'సాహిత్య బాటసారి శారద' పుస్తకంలో వివరించారు. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ తెనాలిలో రచయితగా ఎదుగుతున్న కాలంలో ఇక్కడి హోటళ్లే ఆయన ఆకలిని తీర్చాయి.

ఒకవ్యక్తి ఎన్ని టెండర్లయినా వేయొచ్చు



డీపీఈఓ అరుణకుమారి

తెనాలిరూరల్: ఒకే వ్యక్తి ఎన్ని షాపులకైనా టెండర్లు వేయొచ్చని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ వి.అరుణకుమారి తెలిపారు. తెనాలి కొత్తపేటలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకు వచ్చిన నూతన మద్యం పాలసీ ద్వారా ప్రైవేటు మద్యం దుకాణాల కేటాయింపు కోసం ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. ఈ దరఖాస్తుల స్వీకరణ గడువును శుక్రవారం రాత్రి 7గంటల వరకూ పొడిగించడం జరిగిందని, ఆసక్తి కలిగినవారు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో మొత్తం 127 షాపులకు గాను గురువారం మధ్యాహ్నం ఒంటిగంట వరకూ 2,999 దరఖాస్తులు రావడం జరిగిందని చెప్పారు. అలానే తెనాలిలో 25 షాపులకు గాను 238 అప్లికేషన్లు రావడం తక్కువేనని భావిస్తున్నట్టు చెప్పారు. 14వ తేదీ ఉదయం గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా లాటరీ తీసి షాపుల కేటాయింపుల వివరాలు ప్రకటిస్తామన్నారు. 15వ తేదీ వరకూ పాత మద్యం పాలసీనే అమలవుతుందని 16వ తేదీ నుంచి కొత్త షాపుల ద్వారా కొత్త మద్యంపాలసీ అమల్లోకి వస్తుందన్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై తెలంగాణ బృందం అధ్యయనం

ఎరుకలపూడిలో రైతు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన బృందం



ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో పర్యటిస్తున్న బృందం

తెనాలి: రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం కొన్నేళ్లుగా విజయవంతంగా నడుస్తోంది. రాష్ట్రేతర ప్రాంతాలకు చెందిన రైతు బృందాలు, విదేశీ బృందాలు కూడా ఇక్కడ ప్రకృతి వ్యవసాయంలో పండిస్తున్న పంటలను సందర్శించాయి. రైతులు, కౌలు రైతులు అనుసరిస్తున్న ప్రకృతి విధానాలను తెలుసుకున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రతినిధి బృందం జిల్లాను సందర్శించింది. తెలంగాణ ముఖ్యమంత్రి కార్యదర్శి జి.చంద్రశేఖరరెడ్డి, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి, డిప్యూటీ డైరెక్టర్ కె.శివప్రసాద్, విస్తరణ విభాగం డైరెక్టర్ బి.జమునరాణి, అగ్రానమి ముఖ్యకార్యదర్శి డాక్టర్ ఏవీ రామాంజనేయులు, సూర్యాపేట, ఖమ్మం జిల్లాలకు చెందిన రైతులు, ఖమ్మం రైతుశిక్షణ కేంద్రం, ఎన్జీఓల ప్రతినిధులు ఈ బృందంలో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతుసాధికార సంస్థలో ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టులో పనిచేస్తున్న డీవీ రాయుడు, ప్రకృతి వ్యవసాయం గుంటూరు జిల్లా మేనేజర్ రాజకుమారి, తెనాలికి చెందిన పలువురు ప్రకృతి రైతులు వీరితో ఉన్నారు. తెనాలి రూరల్ మండల గ్రామం ఎరుకలపూడిలో ప్రకృతి వ్యవసాయంలో మాగాణిలో సాగుచేస్తున్న వరిపైరును, గట్లపై పండిస్తున్న కూరగాయలను పండిస్తున్న రైతు విజయలక్ష్మి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. విజయలక్ష్మి స్వయం అనుభవాలను విన్నారు. తమ కుటుంబంలో క్యాన్సర్/ కోవిడ్ కారణంగా ఇద్దరిని కోల్పోయామని, అప్పట్నుంచి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకుంటూ, నలుగురికీ అందించాలనే భావనతోనే ప్రకృతి విధానంలోకి మళ్లినట్టు తెలిపారు. తాను పండించే బియ్యం, కూరగాయలను తోటి రైతులకు అందిస్తూ వారిని కూడా ప్రోత్సహిస్తున్నానని తెలిపారు. రసాయనాలతో వ్యవసాయం చేసే రైతు ఒక్కసారికి ప్రకృతి పద్ధతుల్లోకి రారని చెబుతూ, ఒక్కసారి దీనిని అనుసరించాక మళ్లీ వెనక్కు పోరని తనకు అనుభవపూర్వకంగా తెలిసినట్టు తెలిపారు. తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన అధిక దిగుబడులు సాధిస్తున్నామనీ, ఆదాయం కూడా అలాగే ఉంటోందని చెప్పారు. పంటలపై ఎప్పటికప్పుడు వాడుతున్న బీజామృతం, ఆగ్నాస్త్రం తదితర కషాయాల వివరాలను స్వయంగా తయారుచేసుకుంటున్నామని వివరించారు. ప్రకృతి రైతులు ఈపూరు శ్రీధర్, మీసాల రామకృష్ణ కూడా తమ అనుభవాలను, సాధించిన ఫలితాలను వెల్లడించారు. తెలంగాణలో గతంలో ప్రకృతి వ్యవసాయం అమలు జరిగిందనీ, ఇటీవల కాలంలో కొంత వెనక పడటంతో మళ్లీ ముందుకు తీసుకెళ్లాలన్న భావనతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో ప్రతినిధి బృందం వచ్చినట్టు డీవీ రాయుడు తెలిపారు.

రసవత్తరం.. వీణా అవార్డ్స్ నాటకోత్సవం



'యుద్ధం' సాంఘిక పద్యనాటకంలో ఓ సన్నివేశం

తెనాలి: వీణా అవార్డ్స్–2024 నాటకోత్సవాల్లో భాగంగా గురువారం సమకాలీన సాంఘిక పద్యనాటక విభాగంలో ప్రదర్శించిన 'యుద్ధం' భారతదేశంలో స్త్రీ శక్తినీ, కుటుంబ వ్యవస్థ గొప్పదనాన్నీ చాటింది. కళల కాణాచి–తెనాలి, వేదగంగోత్రి ఫౌండేషన్ – విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో సాంఘిక పద్యనాటక, సాంఘిక నాటక, నాటికల పోటీలు జరుగుతున్నాయి. నాలుగోరోజున కళాంజలి హైదరాబాద్ ప్రదర్శించిన యుద్ధం నాటకాన్ని ఆకురాతి భాస్కర చంద్ర రచించగా, ఇందులో సందర్భోచితమైన పద్యాలను డాక్టర్ బొక్కా శ్రీనివాసరావు, పాటలను శ్రీవిరించి కూర్చారు. కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు. స్త్రీ అంటే అబల కాదు, శక్తిస్వరూపిణి, వాళ్ల నిశ్శబ్దంలోంచి అవసరమైనపుడు అఖండమైన దావానలం పుడుతుందనే ఇతివృత్తంతో రూపొందిన నాటకంలో పూర్ణ సత్యం, సురభి ప్రియాంక, నటకులం శివాజీ, తిరుమల, వరప్రసాదాచారి, సురభి నిఖిలేష్, భుజంగరావు నటించారు. సంగీతం సురభి నాగరాజు.

ఆలోచింపజేసిన '27వ మైలురాయి'

రెండో ప్రదర్శనగా మధ్యాహ్నం యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్, విజయవాడ వారి '27వ మైలురాయి' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. రచన పీటీ మాధవ్ దర్శకత్వం వార్.వాసు. 'నిజం గెలుస్తుంది అనేది నిజమే అయినా గెలిచేదంతా నిజం కాదు' అంటుందీ నాటకం. 1993లో జరిగిన యదార్థ ఘటన ఆధారంగా రచించిన నాటకం '27వ మైలురాయి'. ప్రధాన పాత్రల్లో పి.నటరాజ్, సురభి ప్రభావతి, కుసుమ, వి.భాగ్యశేఖర్, పవన్, కిరణ్, జాహ్నవి నటించారు.

సంస్కృతి వైపరీత్యాన్ని ఎండగట్టిన 'ఇది రహదారి కాదు'

మూడో ప్రదర్శనగా రాత్రి మిత్ర క్రియేషన్స్, హైదరాబాద్ వారు ప్రదర్శించిన 'ఇది రహదారి కాదు' నాటిక సమాజంలో చాపకింద నీరులా చొరపడుతున్న 'డింక్' (డ్యూయల్ ఇన్‌కమ్...నో కిడ్స్) సంస్కృతి వైపరీత్యాన్ని చాటింది. మహానగరాల్లో పెళ్లి చేసుకోకుండా 'లివింగ్ టు గెదర్' (సహజీవనం) అంటున్న నవతరం జంటలను చూస్తున్నాం. ఆ సంస్కృతి నుంచి పుట్టిన 'డింక్' వైపరీత్యాలపై రూపొందిన నాటకం అందరినీ ఆలోచింపజేసింది. ఆకురాతి భాస్కరచంద్ర రచనను ఎస్ఎం బాషా దర్శకత్వంలో ప్రదర్శించారు.



'ఇది రహదారి కాదు' నాటికలో ఓ దృశ్యం

ఆకట్టుకున్న 'మా ఇంట్లో మహాభారతం'

చివరగా మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్స్, చిలకలూరిపేట వారు ప్రదర్శించిన నాటిక 'మా ఇంట్లో మహాభారతం' పేరుకు తగినట్టే పలు ట్విస్టులతో సాగుతుంది. గర్భిణి అయిన ఆ ఇంటి కోడలుకు పుట్టబోయే బిడ్డను ఇంజినీరులో, డాక్టరునో చేస్తామంటారు కుటుంబసభ్యులు. ఆమె మాత్రం తనకు కలిగే బిడ్డను దేశానికి అన్నంపెట్టే అన్నదాతను చేస్తానని చెప్పే కథాంశమే ఈ నాటిక. మద్దుకూరి రవీంద్రబాబు రచనను నడింపల్లి వెంకటేశ్వరరావు దర్శకత్వంలో ప్రదర్శించారు. కళల కాణాచి వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీరచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా, వ్యవస్థాపక కార్యదర్శి షేక్ జానీబాషా, ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్, ఉపాధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, కోశాధికారి దేవరపల్లి భవాని ఇతర కార్యవర్గసభ్యులు పర్యవేక్షించారు.

మానసిక ఒత్తిడితో సమస్యలు



తెనాలిరూరల్: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యాధికారి డాక్టర్ సీహెచ్ సుబ్బారావు మాట్లాడుతూ మానసిక ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యల వలన చిన్న వయసులోనే రక్తపోటు, మధుమేహం, గుండెపోటు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. దేశజనాభాలో 15 శాతం మంది మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఈ వ్యాధులపై అవగాహన పెంచుకొని వైద్యం పొందాలన్నారు. మానసిక రుగ్మతలపై ప్రజలలో చైతన్యం తెచ్చేందుకు ఏటా కార్యక్రమాలను నిర్వహిస్తారని, ఈ ఏడాది 'పని ప్రదేశాలలో మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టండి' అన్న అంశంపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. నిరాశ, ఆందోళన వంటి సమస్యలను మొగ్గ దశలోనే గుర్తించగలిగితే వాటిని సులభంగా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో మానసిక ఆరోగ్య కార్యకర్త శ్రావణి, మానసిక సామాజిక కార్యకర్త బాలయ్య, కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



ఫిరంగిపురం: శాంతిభద్రతల పరిరక్షణకు సిబ్బంది కృషి చేయాలని తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని గొల్లపాలెం గ్రామంలో గురువారం ఓ కేసు విషయంలో ఇరువర్గాలు పరస్పరం దూషణలకు దిగి ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. దీంతో సీఐ రవీంద్రబాబు సిబ్బందితో వెళ్లి ఇరువర్గాలవారిని పంపించివేశారు. డీఎస్పీ ఆదేశాల మేరకు తాడికొండ, మేడికొండూరు, ఫిరంగిపురం స్టేషన్లకు సంబంధించి ఇద్దరు ఎస్ఐలు, 30మంది సిబ్బందితో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు సీఐ రవీంద్రబాబు తెలిపారు. డీఎస్పీ పికెటింగ్ ప్రాంతానికి వెళ్లి సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరించారు.

మహిషాసురమర్దిని ఛాయాచిత్రాల ప్రదర్శన



మోదుకూరులో ఏర్పాటైన ఛాయాచిత్ర ప్రదర్శన



ప్రదర్శనను ప్రారంభించిన డాక్టర్ హైమావతి దంపతులకు సత్కారం

మోదుకూరు(తెనాలి): బాపట్ల జిల్లా చుండూరు మండలం మోదుకూరు గ్రామంలో శ్రీకనకదుర్గ అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేశవిదేశాల్లోని వివిధ శతాబ్దాలనాటి అపురూపమైన మహిషాసురమర్దిని ఛాయాచిత్రాల ప్రదర్శనను ఏర్పాటుచేశారు. యువ పురావస్తు పరిశోధకుడు పాములపాటి శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని వేమన సాహిత్య వికాస పరిషత్ భవనంలో ఏర్పాటైన రెండురోజుల ప్రదర్శనను గురువారం కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ పోలవరపు హైమావతి ప్రారంభించారు. ఆయా శిల్పచిత్రాలకు చెందిన వివరాలను శ్రీనాథ్‌రెడ్డి సందర్శకులకు వివరించారు. డాక్టర్ హైమావతి మాట్లాడుతూ ఈ ఛాయాచిత్రాలను సేకరించటం గొప్ప విషయమన్నారు. అలాంటి అపురూప ఛాయాచిత్రాలను దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రదర్శించటం భక్తులకు మంచి అనుభూతిని కలిగిస్తుందన్నారు. ప్రదర్శన ఏర్పాటు చేసిన శ్రీనాథ్ రెడ్డిని అభినందించారు. రెండురోజులపాటు జరిగే ఈ ప్రదర్శన శుక్రవారం రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. ప్రజలు, భక్తులు తిలకించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డాక్టర్ హైమావతి దంపతులను సత్కరించారు. ఫోటోజెనిక్ ఆర్ట్ సర్కిల్ వ్యవస్థాపక కార్యదర్శి కానాల సుధాకర్‌రెడ్డి, బౌద్ధ పరిశోధకుడు తీయగూరి సీతారామరెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.